బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

కార్యకర్తకు మాజీ మంత్రి పరామర్శ

ఖిల్లాఘణపురం, మార్చి 1 : మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గోపాల్ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని అత్తాపూర్ జాయ్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గోపాల్‌ను పరామర్శించి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పాడు. అనంతరం వైద్యులకు మెరుగైన చికిత్స అందజేయాలని సూచించారు.

పంచాక్షరితో పులకించిన రాజోళి

- రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయుడు

ఆలయంలో పూజలు చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

రాజోళి, మార్చి 1: పంచాక్షరి మంత్రంతో రాజోళి మార్మోగింది. శనివారం భ్రమరాంబ అడివేశ్వర స్వామి రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించగా కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయుడు, పాల్గొన్నారు. అడివేశ్వర చల్లగా చూడమం టూ రాత్రి 7:30 గంటల సమయంలో రథోత్సవానికి ఎమ్మెల్యే విజయుడు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకుల సమక్షంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం నుంచి భక్తి శ్రద్ధలతో రథాన్ని భక్తులు ముందుకు లాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ జాతరలు సాంప్రదాయాలకు ప్రతీకని, వాటిని కాపాడుకుంటూ వేడుకలుగా నిర్వహించుకోవడం అనే సంస్కృతిని ముందు తరాలకు కూడా అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, మార్చి 1 : దివ్యాంగులకు యూడీఐడీ (యూనిక్ డిజేబుల్ ఐడీ) కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం దివ్యాంగులకు యూనిక్ డిజేబుల్ ఐడీ అంశంపై హైదరాబాద్ నుంచి సీఈవో దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెర్ప్ సీఈవో మాట్లాడుతూ దివ్యాంగులందరూ యూనిక్ డిజేబుల్ ఐడీ కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీ సేవ ద్వారా లేదా వ్యక్తిగతంగా యూడీఐడీ పోర్టల్ నుంచి దరఖాస్తు చేసుకొని వైద్యుల స్లాట్ బుకింగ్ ద్వారా అసిస్మెంట్ చేయించుకొని వైకల్య శాతానికి సంబంధించిన డిజబులిటీ సర్టిఫికెట్ పొందవచ్చని చెప్పారు. యూడీఐడీ ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఇతర రాష్ట్రాల్లో చదువుకోవాలనుకునే వారికి ఇది ఉపయోగపడుతుందని ఆమె చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అందరికీ యూడీఐడీ కలిగి ఉండే విధంగా తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. జిల్లాలో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, సీసీలు, ఎంపీడీవోలు, ఏడీఎంలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై శిక్షణ అందించాలన్నారు. దవాఖానలో యూడీఐడీ నిర్ధారణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలని, క్యాంపు నిర్వహణలో దివ్యాంగులకు కుర్చీలు, తాగునీరు తదితర మౌలిక వసతులను కల్పించాలన్నారు. నూతనంగా యూడీఐడీ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారికి దవాఖానలో స్లాట్ బుకింగ్ చేసి సమాచారం అందించాలని, నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన తర్వాత యూడీఐడీ కార్డు కేటాయించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో యాదయ్య, డీఆర్డీవో ఉమాదేవి, జిల్లా సంక్షేమాధికారి సుధారాణి, డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు

స్వామి, అమ్మవార్లకు చక్ర స్నానం నిర్వహిస్తున్న భక్తులు

అలంపూర్,మార్చి 1: అలంపూర్ క్షేత్రంలో ఐదురోజులుగా కొనసాగుతున్న మహా శివరాత్రి ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగిశాయని ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ కొంకల నాగేశ్వర్ రెడ్డి, ఆలయ ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. ఉత్సవాల్లో చివరి రోజు జోగులాంబ బాలబ్రహేశ్వర స్వామికి శేషవాహన సేవ నిర్వహించారు. వసంతోత్సవం అనంతరం ఉత్సవమూర్తులకు చక్రస్నానం నిర్వహించారు. పూర్ణాహుతితో ఉత్సవాలకు పరిసమాప్తి పలికారు. సాయంత్రం ధ్వజ అవరోహణ కార్యక్రమం అనంతరం స్వామి, అమ్మవార్లకు దశ విధ హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, ఆలయ ఈవో, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని హన్మకొండ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే విజయ్ భాస్కర్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. వారి వెంట ఆలయ మాజీ ధర్మకర్త నీలప్ప తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

పాన్‌గల్, మార్చి 1: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు ఉద్యమించాలని సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్ అన్నారు. మండలంలోని తెల్లరాళ్లపల్లి తండాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం ఇంటింటికీ వెళ్లి సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన పూర్తిగా గాడి తప్పిందని ఆరోపించారు. సంక్షేమ పథకాలపేరుతో ప్రజలను మభ్యపెడుతుందని ఆరు గ్యారెంటీలు ఎక్కడా అమలు చేయకపో వడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారన్నారు. ఇందిరమ్మ ఇండ్లు కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు మాత్రమే అందుతున్నాయని, అర్హులకు అందడంలేదని ఆయన వాపోయారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబునాయక్, చిట్టెమ్మ, రవినాయక్ పాల్గొన్నారు.

NIVEDITHA DEGREE COLLEGE
KothaKota, 509381,Wanaparthy, Ph: 9948942406.
(Affiliated to Palamuru University)
WANTED LECTURERS
Application are invited from the qualified candidates for the following
Subjects: **Telugu-2, English-01,Political Science-01.**
Qualification : P.G. in the concerned subject with minimum 55% of marks from any recognised University. Candidates may send their Biodata with Xerox Copies of Certificates on or before 07-03-2025, they will be called for demonstration followed by an interview.
Sd/- Principal / Correspondent

SIDDHARTHA DEGREE COLLEGE
Vallabh Nagar,Old LIC Building,Wanaparthy Dist.(TS), Ph: 9394883960.
(Affiliated to Palamuru University)College Code :3097
WANTED LECTURERS
Application are invited from the qualified candidates for the following
Subjects: **Telugu, English, Botony, Zoology, Chemistry, Mathematics, Physics, Computer Science, Commerce, Economics, Political Science, History.**
Qualification : P.G. in the concerned subject with minimum 55% of marks from any recognised University. Apply on or before10-03-2025.
Sd/- Principal / Correspondent

25శాతం రిబెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాలటౌన్, మార్చి 1 : ప్లాట్ల క్రమబద్ధీకరణకు సంబంధించి మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసేకునే వారికి ప్రభుత్వం 25శాతం రిబెట్ సౌకర్యాన్ని వర్తింపచేస్తుందని అందుకని నాన్ లేఅవుట్‌లో ప్లాట్లు కలిగి ఉన్నవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సంతోష్ సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 ఆగస్టు 26వ తేదీ లోగా దాఖలైన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను మాత్రమే క్రమబద్ధ కరణకు అవకాశం కల్పించగా, ప్రస్తుతం ఆగడువును ప్రభుత్వం ఎత్తివేస్తూ కొత్తగా దరఖాస్తు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించిందన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చే యాలన్నారు. రోడ్లు, ఇనాంభూములు, ఇరిగేషన్ భూములు వంటి వాటిని పక్కాగా పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా అంకితభావంతో పనిచేసి పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, కమిషనర్లు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ అదనపు కలెక్టర్ నర్సింగరావు శనివారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్‌లో కల్పిస్తున్న వసతులు, భోజనంపై ఆరా తీశారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన సూచించారు.

దివ్యాంగులకు యూడీఐడీ నెంబర్ కేటాయించాలి

గద్వాలటౌన్, మార్చి 1 : దివ్యాంగులకు యూడీఐడీ నెంబర్‌ను కేటాయించాలని సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ సూచించారు. హైదరాబాద్ నుంచి సెర్ప్ సీఈవో దివ్యాంగులకు యూనిక్ ఐడీ జారీ, సౌర విద్యుత్ ప్లాంట్లపై కలెక్టర్లతో వీసీ ద్వారా సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ బదులు యూనిక్ డిజేబులటీ ఐడీ జారీ చేయాల్సి ఉంటుందన్నారు. కార్డు జారీకి ప్రభుత్వ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలన్నారు. దివ్యాంగులకు సంబంధించిన ఇతర పూర్తి వివరాలను సంపూర్ణంగా నమోదు చేయాలన్నారు. నూతన ఐడీ కార్డుల కోసం మీ సేవలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఫిబ్రవరి 28, 2025 వరకు జారీ చేసిన సదరం సర్టిఫికెట్‌తో పింఛన్ ఇతర సదుపాయాలు పొందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి ఉండాలన్నారు. జిల్లాలోని మీ సేవ నిర్వాహకులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏలు, సీపీలు, ఎంపీడీవోలు, ఏడీఎంలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై శిక్షణ అందించాలని సూచించారు. నిర్ధారణ కోసం దవాఖానల్లో అవసరమైన పరికరాలు ఉండేలా చూడాలన్నారు. అలాగే సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు కోసం జిల్లాలోని స్థలాలను గుర్తించారని అందుకని విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు చేసే విధంగా డీపీఆర్‌లను తయారు చేయాలని సూచించారు. వీసీలో కలెక్టర్ సంతోష్, అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీడబ్ల్యూవో సునంద, మెడికల్ సూపరింటెండెంట్ ఇందిర పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

- ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి టౌన్, మార్చి 1: జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీస్ అధికారులు, సిబ్బందికి శనివారం నాగరవం ఇందూ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మొత్తం బందోబస్తును 7 సెక్టార్లుగా విభజించామని వివరించారు. ఎస్పీలు నలుగురు (4), అదనపు ఎస్పీలు నలుగురు (4), డీఎస్పీలు 8మంది, సీఐలు 21మంది, ఎస్సైలు 68 మంది, హెడ్ కానిస్టేబుల్స్ 140 మంది, కానిస్టేబుల్స్ 420, మహిళా కానిస్టేబుల్స్/హోంగార్డులు 250, మిగతా పోలీస్ సిబ్బంది మొత్తం 1000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో డీసీఆర్బి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివ కుమార్, వివిధ జిల్లాల డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం పర్యటన బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

బందోబస్త్ పరిశీలించిన జోగుళాంబ డీఐజీ

వనపర్తి టౌన్, మార్చి 1 : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లాకేంద్రంలో బందోబస్త్ ఏర్పాట్లను జోగుళాంబ జోన్-7 డీఐజీ ఎల్ఎస్ చౌహన్ ఎస్పీ రావుల గిరిధర్‌తో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా పాలిటెక్నిక్ కళాశాల హెలిప్యాడ్ నుంచి జెడ్పీహెచ్ బాలుర ఉన్నత పాఠశాల వరకు రూట్ బందోబస్త్‌ను పరిశీలించారు. వీఐపీ కాన్వాయ్ వెళ్లే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్ ఓపెనింగ్ పార్టీ బందోబస్త్ ఏర్పాటు చేయాలని సూచించారు.

నేడు సీఎం పర్యటన

వనపర్తి టౌన్, మార్చి 1: సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం వనపర్తి జిల్లాలో పర్యటించనున్నారని కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు. జిల్లా కేంద్రంలోని పలు అభివృద్ధి పనులకు శిలాఫలకాల ఆవిష్కరణ, కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.

పర్యటన వివరాలు..

- ☛ ఉదయం 11గంటలకు సీఎం జిల్లాకు చేరుకుంటారు.
- ☛ 11:40గంటలకు వేంకటేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులకు శిలాఫలకం ఆవిష్కరణ
- ☛ 12గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలుర) మైదానంలో వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాల ఆవిష్కరణ
- ☛ మధ్యాహ్నం 2:35 గంటలకు కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో లబ్ధిదారులకు వివిధ పథకా పంపిణీ.
- ☛ ఇందిరమ్మ మహిళా శక్తి
- ☛ రేవంతన్న భరోసా పథకం ప్రారంభోత్సవం
- ☛ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా మైనార్టీ మహిళా లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ
- ☛ లోన్ మేళా ద్వారా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ☛ జాబ్ మేళా ద్వారా నియామక పత్రాల అందజేత
- ☛ స్టాల్స్ సందర్శన
- ☛ మధ్యాహ్నం 3గంటలకు ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభ
- ☛ సాయంత్రం 4:35 గంటలకు ముగింపు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాన్‌గల్, మార్చి 1: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఎంజీకేఎల్ఐ కాల్వలో మండల కేంద్రానికి చెందిన ఎండీ.రహ్మతుల్లా(44) శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. ఎస్సై శ్రీనివాసులు కథనం ప్రకారం మండలకేంద్రానికి చెందిన రహ్మతుల్లా జీవనోపాధి నిమిత్తం పెయింటింగ్, మటన్ కటింగ్ పనులు చేసేవాడు. శనివారం తెల్లవారుజామున పొట్టేలు కోసేది ఉందని, గుర్తు తెలియని వ్యక్తి మృతుడి ఇంటికి వచ్చి బయటికి తీసుకెళ్లాడు. బయటికి వెళ్లిన వ్యక్తి ఇంటికి ఎంతకు రాకపోయేసరికి కుటుంబసభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతకగా కనిపించలేదు. బహిర్భూమికి వెళ్లిన వారు మృతదేహాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై శ్రీనివాసులు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లి కాల్వ నుంచి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించారన్నారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్రంలోని ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. బాధిత సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఎర్రవల్లి చౌరస్తా, మార్చి 1 : రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన ఎర్రవల్లి మండలం కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మురళీ కథనం మేరకు కర్నూల్ గోకులపాడు గ్రామానికి చెందిన గ్రామస్తులు తమ గ్రామంలో పెద్దదేవర ఉన్నందు వల్ల పొట్టేళ్లు కొనుగోలు చేయడానికి పెబ్బేరు సంతకు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో కోదండాపూర్ శివారు వద్ద తెల్లవారుజామున 5 గంటల సమయంలో గుర్తుతెలియని ట్యాంకర్ ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఏడుగురికి గాయాలు కాగా అందులో దుదేకుల నబీసాహెబ్ (53) పరిస్థితి విషయంగా ఉండడడంతో కర్నూల్ దవాఖానకు తరలించారు. కర్నూల్‌లో పరిశీలించిన డాక్టర్లు నబీసాహెబ్ అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై ఆటోడ్రైవర్ జుబేర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మట్టి టిప్పర్ పట్టివేత

గద్వాల అర్బన్, మార్చి 1 : అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకున్న ఘటన శనివారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. గద్వాల టౌన్ ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం మేరకు మండలంలోని ఓ గ్రామం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా జిల్లా కేంద్రానికి మట్టిని తరలిస్తురన్నారన్నా సమాచారం మేరకు తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. టిప్పర్లను తనీఖీ చేయగా అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్ గుర్తించి పట్టుకొని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

అమరచింత, మార్చి 1: అర్ధరాత్రి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న ఆవులను పట్టుకొని ఆత్మకూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేసిన పోలీసులు వాటిని గోశాలకు తరలించినట్లు ఆత్మకూర్ మండలం పిన్నంచర్ల గ్రామానికి చెందిన యువకులు అశోక్‌నంద, భూపాల్, నీలా రెడ్డి కల్యాణ్, శివ తెలిపారు. ఆత్మకూర్‌లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి 10గంటల సమయంలో గ్రామ శివారులో వాకింగ్ చేస్తుండగా అమరచింత నుంచి బొలేరో వాహనాన్ని డ్రైవర్ వేగంగా నడపడంతో అనుమానం వచ్చి ఆపడంతో ఆందులో తొమ్మిది ఆవులను గుర్తించినట్లు తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా శనివారం విచారణ చేసిన పోలీసులు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ హమీద్, మహ్మద్ సలార్ అమరచింత మండలంలో ఆవులను కొనుగోలు చేసి తరలిస్తున్నట్లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలి

- విద్యుత్‌శాఖ ఏడీఈ నీలి గోవింద్

గట్టు, మార్చి 1 : వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించాలని, అదేవిధంగా ప్రతి ఇంటికి విధిగా మీటర్లు అమర్చుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీఈ నీలి గోవింద్ స్పష్టంచేశారు. స్థానిక సబ్‌స్టేషన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.కోటి50లక్షల నిధులతో మండలంలో అవసరమయ్యే చోట్ల సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, ఎర్తల ఏర్పాటుతోపాటు మరమ్మతులు, విద్యుత్తు స్తంభాల ఏర్పాటు మొదలగు పనులు చేపట్టినట్లు తెలిపారు. 11కేవీ లైన్‌ల ఒత్తిడిని తగ్గించేందుకు మండలంలో అవసరమైన చోట్ల లైన్లు ఏర్పాటు చేసి ఆధునీకరించినట్లు చెప్పారు. ఆలూరు 33/11 సబ్‌స్టేషన్‌కు గంగన్‌పల్లి 132/33కేవీ సబ్‌స్టేషన్ నుంచి లైన్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. దీనివల్ల గట్టు సబ్‌స్టేషన్‌కు ఒత్తిడి తగ్గనున్నట్లు చెప్పారు. తుమ్మలచెర్వు ప్రాంతంలో రూ.2.5 కోట్ల వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఏడీఈ గోవింద్ స్పష్టంచేశారు. యాసంగిలో పంటలు ఎండిపోకుండా విద్యుత్ సరఫరా చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు చెప్పారు. అంతకుముందు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఏడీఈ మాట్లాడుతూ ప్రతినెలా 6వ తేదీలోపు బిల్లులు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ చిన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ

11శాతం రిజర్వేషన్లు సాధించేదాకా పోరాటం

అయిజలో అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

గట్టు, మార్చి 1 : ఎస్సీ మాదిగ ఉపకులాలకు 11శాతం రిజర్వేషన్లు సాధించేదాకా తమ పోరాటం ఆగదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఏసన్న స్పష్టంచేశారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరుల చిత్రపటాలకు ఎమ్మార్పీఎస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు మహబూబ్‌పాషా, ఎమ్మార్పీఎస్ నాయకులు బండారి డేవిడ్ , జంబన్న, నర్సింహులు, రామకృష్ణ, తిమ్మప్ప, రాముడు, ప్రకాశ్, సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ అమరవీరులకు నివాళి

అయిజ, మార్చి 1 : ఏబీసీడీ వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు నివా ళులర్పించారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆంజనేయులు, ప్రభాకర్, రాజు, సుబ్బన్న, ప్రకాశం, కిష్టఫర్, తిమ్మన్న, మారెప్ప, జమ్మన్న, కృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, మార్చి 1 : మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు శనివారం శాంతినగర్‌లో మాదిగ అమర వీరులకు ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు కొంకల భీమన్న, ఎంఎస్‌పీ నాయకులు అయిజ రాజు ఆధ్వర్యంలో అమరవీరుల స్తూపం వద్ద మాదిగ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏసేపు, రాజశేఖర్, రవి, మీసన్న, శేఖర్, గట్టన్న, మహేంద్ర పాల్గొన్నారు.

మల్దకల్ మండలంలో..

మల్దకల్, మార్చి 1 : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శనివారం అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు మోశన్న మాట్లాడారు. కార్యక్రమంలో తిమ్మన్న, గోవిందు, శేఖర్, రమేశ్‌బాబు, రోహిత్, జయరాజు పాల్గొన్నారు.

ధరూర్ మండలంలో..

ధరూరు, మార్చి 1 : ఏబీసీడీ వర్గీకరణ సాధన కోసం అమరులైన వీరులకు ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. మండల కేంద్రం, మండలంలోని నీలహళ్లి గ్రామంలో ఎమ్మార్పీఎస్ నాయకులు అమరవీరుల చిత్రపటాలకు పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాము, జగన్, ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు జగన్నాథం, గోవిందు, నర్సింహులు, బజారప్ప , శంకర్ , రంగస్వామి , నర్సింహులు, అరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

అయిజ /గోపాల్‌పేట /మల్దకల్, మార్చి 1 : జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో వివిధ పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అయిజ పట్టణంలోని జీవీఆర్ఎం ఉన్నత పాఠశాల, గోపాల్‌పేట మండలంలోని జయన్నతిరుమలాపురం ప్రాథమికోన్నత పాఠశాల, మల్దకల్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. చక్కగా బోధించిన విద్యార్థులకు హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించి బహుమతులు అందజేశారు.

జయన్న తిరుమలాపురంలో స్వపరిపాలన దినోత్సవం

ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

అమరచింత, మార్చి 1: జిల్లా కేంద్రానికి ఆదివారం వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి నాయకుడు అశ్విన్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆత్మకూర్‌లో శనివారం ఆయన స్థానిక నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్ చేయాలని పార్టీలకు అతీతంగా ప్రజలు మొదటి దశలో ఆరవైరోజులు. రెండో దశలో ఉద్యమాలతో పాటు దీక్షలు చేశారని, అప్పట్లో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అన్ని అర్హతలు ఉన్న ఆత్మకూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని ఉద్యమానికి మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మక్తల్ కు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి తాము అధికారంలో వస్తే ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఆయన సీఎంగా పదవి చేపట్టిన ఆత్మకూర్ ప్రజలకు ఇచ్చిన మాట మరిచిపోయారని ఆయన ఎద్దేవా చేశారు. ఆదివారం జిల్లాకు వస్తున్న సీఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఆత్మకూర్‌ను రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని ప్రకటన చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, ఆనంద్, మండ్ల సూరి, సమ్మద్, బాలకృష్ణ ఉన్నారు.

బాలభవన్‌ను పునరుద్ధరించాలి

గద్వాలటౌన్, మార్చి 1 : జిల్లా కేంద్రంలో బాలభవన్‌ను పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. అందుకు సంబంధించిన వినతిపత్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు బీజేపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే పాగపుల్లారెడ్డి కృషితో ఏర్పాటైన బాలభవన్ నేడు బోసిపోతుందన్నారు. ఎందరో కళాకారులు తమ ప్రతిభ ద్వారా బాలభవన్‌కు పేరు తెచ్చినా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా బాలభవన్‌పై దృష్టి సారించి పూర్వవైభవం తేవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయశ్రీ, రవి కుమార్, నర్సింహ, కృష్ణవేణి, బండల పద్మావతి, వెంకటరాములు, చిత్తారి కిరణ్, కృష్ణ, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

పాఠశాలకు 500 ప్లేట్ల వితరణ

మానవపాడు, మార్చి 1 : పేద విద్యార్థుల కోసం నా వంతు సహకారం ఎప్పుడు ఉంటుందని దాత శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాత శ్రీకాంత్‌రెడ్డి తన కుమార్తె బృందతో కలిసి 500 స్టీల్ ప్లేట్లను అందజేశారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి చాలా ఇబ్బందిగా ఉండేదని దాత ముందుకొచ్చి విద్యార్థులకు అవసరమైన ప్లేట్లను అందించడం చాలా సంతోషంగా ఉందని ఎంఈవో శివప్రసాద్ అన్నారు. తన తండ్రి రిటైడ్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేశాడని ఆయన జ్ఞాపకార్థం ప్లేట్లను పంపిణీ చేసినట్లు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రియాజ్, వేణుగోపాల్, స్వరూపారాణి, యోగేశ్వర్ ఉన్నారు.

4న సామాజిక తనిఖీ సమావేశం

అయిజ, మార్చి 1 : ఎన్ఆర్ఈజీఎస్ 14వ విడుత సామాజిక తనిఖీ మండల ప్రజా వేదిక సమావేశం ఈనెల 4వ తేదీ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్న ట్లు ఎంపీడీవో వెంకటయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2023 నుంచి 2024 మార్చి 31 వరకు ఎస్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించి మండలంలోని 28 జీపీల్లోని క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదికలను రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. మండలంలో రూ. 3.77కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ కింద ఖర్చు చేశామని తెలిపారు. రూ.3.52 కోట్లు కూలీల వేతనాలు, రూ. 25లక్షలు మెటీరియల్‌కు ఖర్చు చేశామన్నారు. వాటికి సంబంధించిన పూర్తి నివేదికలను మండల సామాజిక తనిఖీలో వెల్లడించనున్నట్లు వెల్లడించారు.

యూత్ డిక్లరేషన్ హామీలు నెరవేర్చాలి

గోపాల్‌పేట, మార్చి 1 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా యువతకి యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మహేశ్ శనివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ప్రతి ఏడాది రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతామని, నిరుద్యోగ భృతి రూ.4వేలు అందిస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ, ఉపాధి కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగుల విరమణ వయస్సు పెంచే ప్రతిపాదన చేస్తుందని, దీనివల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు రాకుండా తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు పెంచాలనే ప్రతి పాదన ఉప సంహరించుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఆదివారం వనపర్తి జిల్లా పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించాలని డి మాండ్ చేశారు.

బీసీ ఎమ్మెల్యేల పేర్లు పెట్టడం స్వాగతిస్తున్నాం

వనపర్తి టౌన్, మార్చి 1: సీఎం రేవంత్‌రెడ్డి నూతనంగా ప్రారంభిస్తున్న భవనాలకు బీసీ ఎమ్మెల్యేల పేర్లు పెట్టడాన్ని స్వాగతిస్తున్నామని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీశ్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అఖిల పక్ష ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ నాలుగేండ్లుగా అఖిలపక్ష ఐక్య వేదిక బీసీ ఎమ్మెల్యేల చేసిన సేవలు గురించి పోరాటం చేస్తే ఫలితంగా నేడు వనపర్తికి రాబోతున్న సీఎం ప్రారంభం చేస్తున్న సమీకృత రెసిడెన్షియల్ భవనాలకు జయరాములు పేరును, 500 పడకల దవాఖాన భవనానికి డాక్టర్ బాలకృష్ణయ్య పేరును పెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీ ఎమ్మెల్యే జయరాములు విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాలని గత మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చేశారని దీనిపై శ్రద్ధ వహించి టౌన్ హాల్‌లో ఆయన విగ్రహాన్ని పెట్టి, టౌన్ హాల్‌కు జయరాములు పేరు మీదుగా ప్రారంభించాలన్నారు. గతంలో కేంద్రమంత్రి దివంగత జయపాల్‌రెడ్డి జయరాములు పేరుమీద పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్‌ను ఓపెన్ చేశారని, ఇప్పుడు వారి పేరు తూడ్చివేశారని దానిని కూడా పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో ఐక్యవేదిక నేతలు వెంకటేశ్వర్లు, శంకర్, బాలు, యాదయ్య, సతీశ్, శ్రీనివాసులు, పాషా పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

వనపర్తి /అమరచింత /గద్వాల టౌన్ మార్చి 1: 2025-26 ఏడాదిగానూ హ్యాండ్లూమ్ అండ్ టెక్స్ టైల్స్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ డిప్లొమా కోర్సులో మూడేండ్ల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి అడ్మిషన్లు ప్రారంభమవుతాయని ఆసక్తి గలవారు ఆలోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలన్నారు.